
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.6 ; కనిష్ఠం 25.9

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్

జిల్లా వార్తలు



• మోపాల్‌లో ధాన్యం తూకం వేస్తున్న సిబ్బంది

జిల్లాలో ధాన్యం సేకరణకు గన్నీ బ్యాగులు, హమాలీల కొరత

» కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు తిప్పలు పడుతున్న యంత్రాంగం
» అకాల వర్షాలతో ఆందోళనకు గురవుతున్న రైతులు
» గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని వినతి
» జిల్లాలో ఇప్పటి వరకు 2లక్షల 92వేల 506 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

నిజామాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం సేకరణకు గన్నీ బ్యాగులు, హమాలీల కొరత వేధిస్తోంది. గత సీజన్‌తో పోలిస్తే ఈ సీజన్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చేందుకు గన్నీ బ్యాగులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాకు ఈ సీజన్‌లో రెండు కోట్ల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా ఇప్పటి వరకు కోటి వరకు సరఫరా చేశారు. ప్రతిరోజూ 5లక్షల గన్నీ బ్యాగులను తెప్పిస్తూ కొనుగోలు కేంద్రాలకు పంపిస్తున్నారు. గన్నీ బ్యాగుల కోసం మాత్రం పలు కేంద్రాలలో రైతులు ఎదురు చూడటంతో పాటు బ్యాగుల కోసం పోటీ పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు రాగానే బ్యాగులను తీసుకువెళ్తూ ధాన్యాన్ని నింపుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని నింపేందుకు హమాలీల కొరత కూడా వేధిస్తుంది. పలు గ్రామాల పరిధిలో రోజుల తరబడి ధాన్యం నింపేందుకు హమాలీల కోసం వేచిచూసే పరిస్థితి ఎదురవుతోంది. ధాన్యం నింపిన మిల్లులకు పంపించేందుకు లారీలలోడ్‌ను చేసేందుకు హమాలీలు లేక ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడుతుండటంతో తడవకుండా కాపాడేందుకు తిప్పలు పడుతున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల పరిధిలో ధాన్యం నిల్వలు పేరుకుపోతుండటంతో అధికారులు కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

25 రోజులుగా కొనుగోళ్లు

జిల్లాలో 25 రోజులుగా ధాన్యం కొనుగోళ్లను చేస్తున్నారు. ప్రతిరోజూ 15వేల మెట్రిక్ టన్నుల నుంచి 20వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 690 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఇప్పటి వరకు 465 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నారు. మహిళా గ్రూపులతో పాటు సహకార సంఘాల ద్వారా ఈ ధాన్యాన్ని కొంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2లక్షల 92వేల 506 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లాలో సేకరించారు. దీనిలో సన్నరకాలు 2లక్షల 81వేల 521 మెట్రిక్ టన్నులు ఉండగా, దొడ్డురకం 10వేల 985 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 30వేల 249 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 678 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని తీసుకున్నారు. రైతుల ఖాతాల్లో 207 కోట్ల రూపాయలను జమ చేశారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యంలో 95 శాతం వరకు సన్నరకం ధాన్యమే ఉంది. యాసంగిలో 75 శాతం సాగు సన్నరకాలు చేయడం వల్ల రైతులు బోనస్ కోసం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. రోజుల తరబడి వేచి చూసి అమ్మకాలు చేస్తున్నారు.

8లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు ఏర్పాట్లు

జిల్లాలో ఈ సీజన్‌లో 8లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని సేకరించాలని అధికారులు నిర్ణయించారు. దానికి అనుగుణంగానే ఏర్పాట్లు చేశారు. గత సీజన్‌కంటే కొనుగోలు కేంద్రాలను కూడా ఎక్కువగా ఏర్పాటు చేశారు. టార్పాలిన్‌లతో పాటు కొనుగోలు కేంద్రాలకు అవసరం ఉన్న అన్ని సామగ్రిలను సమకూర్చారు. ప్రధానంగా గన్నీ బ్యాగుల కొరత మాత్రం ఎక్కువగా ఏర్పడుతుంది. నెలన్నర రోజులుగా వరి కోతలు చేస్తున్న రైతులు సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు ఎదురు చూస్తున్నారు. ఈ సీజన్‌లో మొత్తం 2కోట్ల గన్నీ బ్యాగులు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు కోటి గన్నీ బ్యాగులను కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేశారు. మిగతా బ్యాగులను ప్రతీరోజు 5లక్షల వరకు తెప్పిస్తూ కేంద్రాలకు తరలిస్తున్నారు. గన్నీ బ్యాగులు ఎక్కువగా వెస్ట్ బెంగాల్ నుంచి తీసుకురావడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్ని 40 కిలోల బ్యాగులు కావడంతో సమస్య ఎదురవుతుంది. అకాల వర్షాలు అక్కడక్కడ పడుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పూర్తిస్థాయిలో ధాన్యం కోతలు అవుతున్నందున వెంట వెంటనే అమ్మేందుకు పోటీ పడుతున్నారు. గన్నీ బ్యాగులు రాకపోవడంతో కొన్ని కేంద్రాల వద్ద ఆందోళనలు కూడా చేస్తున్నారు. దీన్ని తగ్గించేందుకు అవసరం ఉన్నచోటికి ఎక్కువ మొత్తంలో బ్యాగులను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి కూడా తెప్పించేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. గన్నీ బ్యాగులతో పాటు హమాలీల కొరత కూడా ఎక్కువగా వేధిస్తోంది. జిల్లాకు ప్రతీ సీజన్‌లో బీహార్, యూపీ, ఒడిస్సా నుంచి ఎక్కువగా హమాలీలు వస్తున్నారు. ఈ సీజన్‌లో మాత్రం బిహార్ నుంచి హమాలీలు రాకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. అక్కడ ఎన్నికలు ఉండటం ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో ఆ రాష్ట్రంలో పనులు కల్పించడంతో హమాలీలు ఉపాధి కోసం రావడం లేదు. వచ్చిన వారి ద్వారానే ఆయా కేంద్రాలకు పంపిస్తూ ధాన్యాన్ని తరలించేందుకు అధికారులు తిప్పలు పడుతున్నారు. గన్నీ బ్యాగులతో పాటు హమాలీల కొరత ఉండటం వల్ల కొన్ని కేంద్రాల్లో కొనుగోలు కూడా ఆలస్యం కావడం వల్ల ధాన్యం నిలిచిపోతుంది. ఎటుచూసినా గ్రామాల్లో ధాన్యం కుప్పలే దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ట్రాక్టర్లను కూడా అనుమతించేందుకు అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం సేకరించేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని పౌరసరఫరాల సంస్థ డీఎం కార్తికరెడ్డి, డీఎస్‌వో అర్వింద్‌రెడ్డిలు తెలిపారు. నిర్ణీత సమయంలో కొనుగోలు చేయడంతో పాటు రైతులకు వెంటవెంటనే ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా గన్ని బ్యాగులు అందిస్తున్నామని హమాలీల కొరతను లేకుండా చూస్తున్నామని ఆయన తెలిపారు.

తాగు నీటి కోసం అల్లాడుతున్న వన్యప్రాణులు

• అడవుల్లో నీటి జాడ కరువు
• సాసర్ పీట్లలో కనిపించని నీరు

7



ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంచుకోవాలి

• హిందూ ధర్మం పవిత్రమైనది
• హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి

7



భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

» జిల్లా వ్యాప్తంగా చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు
» శిలువ ఏర్పాటు చేసి యేసు ప్రభు త్యాగాలను గుర్తు చేసుకున్న క్రైస్తవులు

(వివరాలు 7, 8 పేజీల్లో)

జిల్లాలో భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్నాం

» ఈనెల 30 వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో సదస్సులు
» వచ్చేనెల ఆరంభం నుంచి అన్ని గ్రామాల పరిధిలో..
» 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిజామాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త భూ భారతి చట్టం అమల్లో భాగంగా జిల్లాలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నాం. చట్టంలోని అన్ని అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తాం. కొత్త మార్గదర్శకాలు వెలువడగానే వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. భూభారతి చట్టంపై 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కలెక్టర్: భూభారతి చట్టం ధరణి స్థానంలో అమలవుతుంది. మొదట మండలానికి ఒక గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నాం. రైతులతో పాటు అధికారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెలాఖరు వరకు మండలాల పరిధిలో, వచ్చేనెల నుంచి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం.

ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని మండలాలను ఎంపిక చేశారు. జిల్లాలో కూడా ఆ రీతిలో చేస్తారా?

కలెక్టర్: ఈనెల 30 వరకు రెవెన్యూ సదస్సులను అన్ని మండలాల పరిధిలో ఒక్కొక్క గ్రామంలో పూర్తి చేస్తాం. ఆలోపు పైలెట్ ప్రాజెక్టు కింద మండలాలను ఎంపిక చేస్తాం. ఆ గ్రామాల్లో పూర్తిస్థాయిలో సదస్సులను నిర్వహించి సమస్యలపై అవగాహన కల్పిస్తాం.

ఆంధ్రజ్యోతి: ధరణిలో భూసమస్యల కోసం రైతులు ఏళ్ల తరబడి ప్రయత్నాలు చేశారు. చివరకు సివిల్ కోర్టుల వరకు వెళ్లారు. కొత్త చట్టంలో వీటి కోసం పరిష్కారం ఉందా?

కలెక్టర్: భూభారతి కొత్త చట్టంలో పలు అంశాలకు పరిష్కారం దొరుకుతుంది. ఆర్‌వోఆర్ చట్టం ప్రకారం రైతులు దరఖాస్తు చేసుకున్న నిర్దిష్ట గడువులోపు సమస్యలను పరిష్కరిస్తాం. ఆర్‌డీవోలు, కలెక్టర్ల పరిధిలో అప్పీల్ కూడా చేసుకోవచ్చు. ధరణిలో వీటికి సంబంధించి అనుమతులు లేవు. ఇక్కడ పరిష్కారం కాకుంటే సీసీఎల్‌ఏలో కూడా దరఖాస్తులు చేసుకోవచ్చు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ల్యాండ్ ట్రిబ్యునల్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. మెజార్టీ సమస్యలన్నీ ఆర్‌డీవో, కలెక్టర్ స్థాయిలోనే జరుగుతాయి. అప్పీల్ చేసుకునేందుకు రైతులకు సరైన స్థోమత లేకుంటే ఉచితంగా కూడా న్యాయ సహాయం అధికారులే అందిస్తారు.

ఆంధ్రజ్యోతి: కొత్త చట్టం ప్రకారం సాదాబైనామాలను పరిష్కరిస్తారా? ఎన్నేళ్లుగా వీటి పరిష్కారం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు?

కలెక్టర్: ధరణిలో సాదాబైనామాలకు పరిష్కారం దొరకలేదు. రైతులు పలుమార్లు దరఖాస్తులు చేసుకున్న పరిష్కారం కాలేదు. భూ భారతి చట్టం ప్రకారం సాదాబైనామాలను కూడా పరిష్కరిస్తాం.

ఆంధ్రజ్యోతి: భూభారతి చట్టం ప్రకారం గ్రామాల వారీగా రికార్డులను తయారు చేస్తారా? ఆధార్ కార్డులాగా భూమికి భూధార్ కార్డులను ఇస్తారా?

కలెక్టర్: ప్రతి గ్రామంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తున్న గ్రామంలోని భూములకు సంబంధించిన అన్ని రికార్డులను గ్రామ పంచాయతీల్లో పెడతాం. ప్రతి గ్రామంలో రెవెన్యూ అధికారులను నియమించడంతో పాటు భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా మెయింటెన్ చేస్తాం. ఆధార్ లాగా భూములకు సంబంధించి భూధార్ కార్డులను కూడా కొత్త చట్టం ప్రకారం ఇస్తారు. వీటిలో భూములకు సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరుస్తారు.

ఆంధ్రజ్యోతి: కొత్త భూభారతి చట్టం అమల్లోకి రావడం వల్ల ధరణిలో ఉన్న భూ రికార్డులు దీనిలో కొనసాగుతాయా?

కలెక్టర్: భూభారతి చట్టం ప్రకారం ధరణిలో ఉన్న భూ రికార్డులన్నీ దీనిలో కొనసాగుతాయి. ధరణిలో స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి ప్రస్తుతం కొత్త చట్టం ప్రకారమే తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కొత్త చట్టంలో రికార్డులోని తప్పులను సవరించేందుకు అవకాశం కల్పించారు. కొత్త చట్టం రావడం వల్ల ధరణిలోని రికార్డులు యథావిధిగా కొనసాగుతాయి.



• మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

భూ భారతి చట్టంపై అవగాహన ఉండాలి

• ఆధార్ తరహాలో భూధార్ సంఖ్య కేటాయింపు • అవగాహన సదస్సులో కలెక్టర్

మోపాల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పరుచుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో భూభారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ చట్టంలోని అంశాలపై గ్రామాల్లో విస్తృతంగా చర్చిస్తూ తోటి రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కొక్క అంశం వారీగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూసమస్యలు కలిగి ఉన్న రైతులు ఏడాదికాలంలోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అవగాహన సదస్సు అనంతరం మే మొదటి వారంలో అధికారులు గ్రామాల వారీగా సదస్సులను ఏర్పాటు చేసి దరఖాస్తును స్వీకరిస్తారని అన్నారు. ధరణిలో రెవెన్యూ కోర్టులను తొలగించడం వల్ల భూ వివాదాల విషయంలో రైతులు సివిల్ కోర్టులను ఆశ్రయించవల్సి వచ్చిందని గుర్తు చేశారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుత భూభారతి చట్టం ద్వారా ఇంతకు ముందు తరహాలోనే రెవెన్యూ కోర్టులు పునరుద్ధరించిందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా పరిష్కారం కోసం భూభారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వీటికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు వెలువడనున్నాయని తెలిపారు. అనంతరం ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణిని ఏర్పాటు చేయడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని రద్దు చేసి భూభారతి చట్టాన్ని తీసుకు రావడం పట్ల రైతులకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, ఆర్‌డీవో, తహసీల్దార్లు, ఆయా గ్రామాల రైతులు, మహిళలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం

డిచ్‌పల్లి: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం అని దీనిపై రైతులు పూర్తి అవగాహన ఏర్పరుచుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. ఈ చట్టంలోని అంశాలపై గ్రామాల్లో విస్తృతంగా చర్చిస్తూ తోటి రైతులకు అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని నడిపల్లి రైతు వేదికలో నిర్వ హించిన భూభారతి చట్టం అవగహన సదస్సు లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టం ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశం పవర్‌పయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సదస్సులో ఆర్డీవో రాజేందర్ కుమార్, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారచంద్ నాయక్, మండల స్పెషల్ ఆఫీసర్ యోహాన్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్, స్థానిక అధికారులు, ఆయా గ్రామాల రైతులు, మహిళలు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న మహిళలు, రైతులు



కమ్మర్‌పల్లిలో నేలరాలిన మామిడి కాయలు



నార్సింగ్‌పల్లిలో రోడ్డుపై విరిగిపడిన భారీ వృక్షం

ఈదురు గాలులతో వర్షం

• నేలరాలిన మామిడి • విరిగిపడిన చెట్ల కొమ్మలు • నిలిచిన విద్యుత్ సరఫరా

కమ్మర్‌పల్లి/సిరికొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కమ్మర్‌పల్లి, సిరికొండ మండలాలతోపాటు పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. నిప్పులకొలిమిలా భగభగమండే ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురు గాలులతో కూడిన చిరుజల్లు కురిశాయి. దీంతో కమ్మర్‌పల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. ఈదురు గాలులకు విద్యుత్‌సరఫరా నిలిచిపోగా చేతికందవచ్చిన మామిడికాయలు నేలరాలాయి. విద్యుత్ శాఖ అధికారులు విరిగిన చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే సిరికొండ మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. నార్సింగ్‌పల్లిలో ఓ ఇంటిపై రేకులు కొట్టుకుపోయి ఇంట్లోని సామగ్రి చిందరవందరగా మారాయి. చీమన్‌పల్లి, గడ్కోల్, సిరికొండ రామడుగు తదితర గ్రామాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. రామడుగులో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

పారిశ్రామిక వాడలో అగ్నిమాపక వారోత్సవాలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పారిశ్రామిక వాడల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నగర శివారులోని ఖానాపూర్ రోడ్‌లోగల రైస్‌మిల్లులో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నర్సింగ్‌రావు, సిబ్బంది సుమన్, కిరణ్, ప్రశాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి, ధాన్యం కొనుగోళ్ల ఇబ్బందులపై ఫిర్యాదుకు.. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తినా, ధాన్యం అమ్మకాల్లో రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు నెల కొని ఉన్నా.. వారు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నెంబర్ 18004256644కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలుపవచ్చని అన్నారు. కంట్రోల్ రూమ్ కార్యాలయాల పనిదినాలలో ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్ణీత వేళల్లో టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ధాన్యం అమ్మకాలు, తాగునీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలుపవచ్చని సూచించారు. వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. తాగునీటి సమస్య కోసం సెల్ ఫోన్ నెంబర్ 7382844951, ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులు ఉంటే 7382844769కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చని సూచించారు. ఐడీవోసీ నిజామాబాద్ మెయిల్‌కు కూడా సమాచారం తెలియజేయవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలు, రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరుచూరి అనూష ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో డిగ్రీలో ప్రవేశానికి 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థినులు అర్హులన్నారు. కళాశాలలో బీఎస్సీ ఎంపీసీఎస్, ఎంఎస్ డీఎస్, ఎంఎస్ సీఎస్, బీజడ్సీ, ఎన్‌జడ్‌సీ, బీకాం సీఏ, బీకాం బీఏ, బీఏ (ఈపీ హెచ్) కోర్సులలో విద్యా బోధన కొనసాగుతుందన్నారు. అర్హులైన విద్యార్థినులు తమకు ఆసక్తి ఉన్న గ్రూపులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, నాణ్యమైన విద్య, ఉచిత వసతులు, అనునాథన ల్యాబొరేటరిలు, కంప్యూటర్ ల్యాబ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ అన్ని సౌకర్యాలు కలిగిన కళాశాలలో చదవాలని కోరారు. ఈ నెల 16వ తేదీన ప్రవేశాలు ప్రారంభమయ్యాని అర్హులైన విద్యార్థినులు కళాశాలలో సంప్రదించాలని లేదా మీ సమీపంలోని మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99481 92406, 95427 45057 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ అనూష కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్, పర్కిట్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీ శ్రీనివాస్ తెలిపారు. ఆర్మూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా సంబంధిత సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఆర్మూర్, అంకాపూర్, ఇస్సాపల్లి, ఆలూర్, పెర్కిట్, మామిడిపల్లి, ఫత్తేపూర్, గోవింద్‌పేట్, లక్కోర, చేపూర్, పిప్రి, మగ్గిడి, సుర్బిర్యాల్, కోమన్‌పల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నందిపేట, మాక్లూర్, నవీపేట మండలాల్లో..

నందిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నందిపేట, మక్లూర్, నవీపేట మండలాల పరిధిలో ఉన్న 33/11కేవి సబ్ స్టేషన్ ఉప కేంద్రాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నందిపేట డివిజన్ ట్రాన్స్‌కో ఏడీ మారెల్లి అశోక్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ చెప్పారు. దీనికి నందిపేట, మాక్లూర్, నవీపేట మండలాల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ మారెల్లి అశోక్ కోరారు.

బోధన్‌లో..

బోధన్‌రూరల్: పట్టణ ప్రజలకు నిత్యం విద్యుత్ సరఫరా అందించాలన్న ఉద్దేశంతో శనివారం సబ్‌స్టేషన్ మెంటెనెన్స్‌లో భాగంగా 33/11కేవీ బోధన్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కావున శనివారం ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. ప్రజలకు నిత్యం విద్యుత్ అందించాలన్న ఉద్దేశంతో మరమ్మతులు చేపడుతున్నామని ప్రజలు సహకరించాలని పట్టణ ఏఈ నాయిని కృష్ణ కోరారు.

కుల సంఘ భవనానికి నిధుల మంజూరు



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న బీజేపీ నాయకులు

ముప్కాల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని నల్లూర్ గ్రామానికి చెందిన ఆదివాసి నాయకపోడు సంఘ భవనానికి ఎంపీ నిధుల ద్వారా రూ.4లక్షలు మంజూరైనట్లు బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ తెలిపారు. ఈ మంజూరైన ప్రొసీడింగ్ కాపీని కుల సంఘం సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ నిధులు మంజూరు చేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఆదివాసి నాయక్‌పోడు సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వరి పంటపై రైతు అవగాహన సదస్సు

ఆలూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం మిర్ధాపల్లి గ్రామంలో సిరి సీడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం వరి, మొక్కజొన్న పంటలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరి కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ అధిక దిగుబడి, అధిక రాబడి కలిగించే తమ ఉత్పత్తుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రంజిత్ కుమార్, శ్రీనివాస్, ప్రమోద్, రైతులు పాల్గొన్నారు.

పాడి యజమానులు

పశువుల టీకాలపై అపోహలు వీడాలి

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులు పెంచే యజమానులు పశువులకు వేసే టీకాలపై అపోహాలు వీడి తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ లక్కం ప్రభాకర్ అన్నారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లిలో శుక్రవారం ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించి పశువులు ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తల పడాన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు పండ్లు, కాలి గిట్టల మధ్య చెడి నడవలేక మేత తినలేక నీరసించి పోయే ప్రమాదం ఉటుందన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. సంవత్సరానికి రెండు సార్లు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్వర్, రాధ, దివ్య, నాగార్జున, శ్రీనివాస్, గోపాలమిత్ర రాజన్న పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు బోధన్ వాసి ఎంపిక

బోధన్‌రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్లోబర్ అవార్డు 2025కు బోధన్ వాసి ఎంపికయ్యారు. బోధన్ పట్టణానికి చెందిన చింతాకుల లోకేష్ గౌడ్ మార్కెటింగ్ సోషల్ సర్వీస్ విభాగంలో సేవలకుగాను నేషనల్ గ్లోబల్ అవార్డు అందుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణానికి చెందిన యువకుడు లోకేష్ గౌడ్ నేషనల్ గ్లోబర్ అవార్డు అందుకోవడం అభినందనీయమని పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయానికి సౌండ్ సిస్టం వితరణ

ఆర్మూర్ రూరల్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ శుక్రవారం దేవి ఆలయానికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సౌండ్‌సిస్టం వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యుల వినతి మేరకు భక్తుల సౌకర్యార్థం రూ. 5వేల విలువ చేసే సౌండ్ సిస్టంను ఆర్మూర్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజనీష్‌కిరాడ్ అందజేశారు. సౌండ్ సిస్టం అందజేసిన రజనీష్ కిరాడ్‌కు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆరె లింబాద్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమలో రోటరీ క్లబ్ కార్యదర్శి రాన ఆనంద్, మాజీ అధ్యక్షుడు పుష్పాకర్ రావు, చరణ్‌రెడ్డి, వేల్పుల లక్ష్మీనారాయణ, తొగర్ల రాజేశ్వర్, రఘునాథ్, తొగర్ల రాజన్న, గడ్డి గంగాధర్, బల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ఎడపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇండేన్ గ్యాస్, నేషనల్ పెట్రోల్ పంపు యాజమాన్యానికి, సిబ్బందికి శుక్రవారం బోధన్ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం అగ్నిమాపక ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకునే జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, వంశీ కృష్ణారెడ్డి, గంగారాం తదితరులు ఉన్నారు.



బోధన్‌లోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



దూదిగాం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

బోధన్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో శుక్రవారం పలు చర్చిలలో గుడ్‌ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉపవాస దీక్షలు ఆచరించారు. జీసస్ శిలువపై చనిపోయిన రోజు గుడ్‌ఫ్రైడేగా నిర్వహిస్తారని చర్చి ఫాదర్లు తెలిపారు. జీసస్ చూపిన బాటలో నడవాలని, ప్రతీ ఒక్కరు ప్రేమ, కరుణ కలిగి ఉండాలని మత పెద్దలు బోధించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మత పెద్దలు, ఫాదర్లు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని వీరన్నగుట్ట, దూపల్లి, బాగేపల్లి, నీలాక్యాంప్, తాడ్‌బిలోలి గ్రామాలలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రిస్టియన్లు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నీలాక్యాంప్‌లో చర్చి ఫాదర్ వినోద్ ఆధ్వర్యంలో శిలువను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని ఈ క్రీస్తు ఆశీర్వాదం వల్ల చల్లగా ఉండాలని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు ఎంఎల్ రాజు, రవి, రాజు, బాల కిరణ్ పాల్గొన్నారు.

నవీపేట: గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలలోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నవీపేట, అభంగపట్నం, కమలాపూర్, నాడాపూర్, నాగేపూర్, లింగాపూర్ తదితర గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు యేసుక్రీస్తు సందేశాన్ని వివరించారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాలలోని శుక్రవారం చర్చిలలో వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. జక్రాన్‌పల్లి, అర్గుల్, పడకల్, బ్రాహ్మన్‌పల్లి, తొర్లికొండ, కొలిప్యాక్, మనోహరబాద్, కలిగోట్, కేశ్‌పల్లి, మునిపల్లి తదితరల చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థణలు చేశారు. అనంతరం ఒకరినొకరు గుడ‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పాస్టర్లు పాల్గొన్నారు.

దూదిగాం సీఎస్ఐ చర్చిలో..

మెండోర: మండలంలోని దూదిగాంలోని సీఎస్ఐ చర్చిలో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ సీహెచ్ ఇమ్మానుయేల్ క్రైస్తవులకు గుడ్‌ఫ్రైడే విశిష్ఠతను వివరించారు. క్రైస్తవులు 40 రోజులు ఉపవాసం పాటించి చివరి రోజు గుడ్‌ఫ్రైడే జరుపుకుంటారన్నారు. ఏసుప్రభువు మానవాళి రక్షణకు కల్వరి సిలువలో పలికిన ఏడుమాటలు దైవసేవకులు, సంఘ పెద్దలు ధ్యానించి బైబుల్‌లోని ఏసుప్రభు ప్రభోదనలు వివరించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు, మహిళలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడులు

వేల్పూర్: మండలంలోని పలు గ్రామాల చర్చిలలో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పడగల్, వేల్పూర్, మోతె, జాన్కంపేట, అంక్సాపూర్, పచ్చల నడ్కుడ , వెంకటాపూర్, రామన్నపేట్, అమీనాపూర్, అక్లూర్ గ్రామాల్లోని వివిధ చర్చిలలో యేసుక్రీస్తు మరణంల ప్రత్యేక పాటలు పాడారు. జీజస్ సిలువపై పలికిన ఏడు మాటల సారాంశాన్ని పాస్టర్లు, దైవ సందేశం వినిపించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో

మోదీ, అమిత్‌షా చిత్రపటాల దహనం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా, రాహుల్ గాంధీలపై కేంద్ర ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి చార్జ్‌షీట్‌లో పేర్లు నమోదు చేసినందుకు నిరసనగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వ్యవస్థలన్నీ విలీనం చేస్తూ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, నల్ల ధనాన్ని వెలికి తీస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రధాని మోడీ కుట్ర పూరితంగా బీజేపీ పాలనపై పోరు చేస్తున్న సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై అక్రమంగా ఈడీ కేసులు పెట్టి ఛార్జ్‌షీట్ నమోదు చేశారని ఇది దారుణమన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ఫ్రాసిస్టు పాలన సాగిస్తుందన్నారు. రాహుల్ గాంధీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక మోడీ సర్కార్ అక్రమ కేసుల కుట్ర పన్నుతుందని ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా కేసులు నమోదు చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము శరత్‌రెడ్డి, తలారి నవీన్, మీర్ నజీర్ అలీ, డబ్బు, గుండెటి రాములు, అర్షద్, భూమేష్, కిషోర్, కలీల్, సాయికృష్ణ, హైమద్, సలీం, ఇమ్రాన్, నవీన్, జునేద్, ఇనాయత్ అలీ పాల్గొన్నారు.

'బీజేపీని విమర్శించడం శోచనీయం'

మోర్తాడ్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు గత పదేళ్లలో ఒక్కసారి కూడా అంబేద్కర్‌కు దండ వేయనివారు బీజేపీ నాయకులు పాల్గొన్న కార్యక్రమాన్ని ఉద్దేశించి అంటరాని వారీగా చిత్రీకరించడం శోచనీయమని మండల ఎస్సీ మోర్చ అధ్యక్షుడు పోరం ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా మేము పాల్గొన్న కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు అంటరాని వ్యక్తులుగా చిత్రీకరించడం జరిగిందని దాన్ని మేము తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. అంబేద్కర్‌ను కేవలం ఒక ప్రాంతానికి, ఒక వర్గానికి పరిమితం చేయడం ఓటుబ్యాంక్ రాజకీయం కోసమేనని ఆయన అన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో ఇంటర్నేషనల్ సెంటర్ ఏర్పాటు చేసిన అంబేద్కర్ రచించిన పుస్తకాలను 8 భాషల్లో అనువాదం చేయించాలని అంబేద్కర్‌ను గౌరవిస్తు గౌరవాన్ని కాపాడుతున్న పార్టీ బీజేపీయేనన్నారు. ఏమి తెలుసుకోకుండా అజ్ఞానంతో మాట్లాడడం మానుకోవాలని మళ్లీ ఇలాంటి వాక్యాలు చేస్తే చూస్తూ ఊరుకోమని ప్రకాష్ అన్నారు. సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు పుప్పాల నరేష్, బీజేపీ నాయకులు పైడి చిన్నారెడ్డి, శివానంద్, చిన్న నర్సయ్య, పైడి గంగారెడ్డి పాల్గొన్నారు.

పశువులకు ఆరు నెలలకోసారి టీకాలు వేయించాలి

● కమ్మర్‌పల్లి వెటర్నరి డాక్టర్ రాజశేఖర్‌రావు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పశువుల పెంపకందారులు తమ పశువులకు ప్రతీ ఆరునెలలకోమారు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరి వేయించాలని కమ్మర్‌పల్లి వెటర్నరీ డాక్టర్ రాజశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కమ్మర్‌పల్లితో పాటు ఉప్లూర్ గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 72 గోజాతి, 109 గేదేజాతి పశువులకు గాలికుటువ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. జీవాలు గాలికుంటు వ్యాధి బారిన పడడం కారణంగా నోటిలో ఏర్పడే పుళ్లతో చొంగ కారుస్తాయని, కాలిడొక్కల్లో నగుళ్లు ఏర్పడి నడవలేని స్థితికి చేరుతాయని, పాల ఉత్పతి తగ్గి చూడిపశువులు అబర్షన్‌లకు దారితీస్తాయన్నారు. పాడి రైతులు ముందస్తు చర్యల్లో భాగంగా టీకాలు వేయించి పశు సంపదను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, పశువైద్య సిబ్బంది, గోపాల మిత్ర స్వరన్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసమే

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర

బోధన్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కోసమే కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని సాలూర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మందర్నా రవి అన్నారు. శుక్రవారం సాలూర మండలంలోని సాలంపాడ్, కుమ్మన్‌పల్లి, సాలంపాడ్ క్యాంప్ గ్రామాలలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాలంపాడ్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాలలో వివిధ వర్గాలు, ప్రజలు, మహిళలను కలిసి రాజ్యాంగ పరిరక్షణ కరపత్రాలను పంచి రాజ్యాంగం గొప్పతనాన్ని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మందర్నా రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై.నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, అల్లె రమేష్, ఖాజాపూర్ అశోక్, చిద్రపు అనిల్, సాలూర క్యాంప్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

మహిళ మెడలో నుంచి

బంగారు గొలుసు అపహరణ

నవీపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధర్యాపూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఆరు బయట నిద్రిస్తున్న పట్నం బాగిర్తి అనే మహిళ మెడల్లోంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు ఎత్తుకెళ్లాడని ఎస్సై వినయ్ తెలిపారు. మాక్లూర్‌కు చెందిన పట్నం బాగిర్తి తల్లి మూడు రోజుల క్రితం అనారోగ్యంతో నవీపేటలో మృతి చెందగా నిద్ర చేయడానికి గురువారం రాత్రి ఆమె నవీపేటకు వచ్చింది. అదే రాత్రి స్థానిక హనుమాన్ మందిరంలో గంటసేపు ఉండి నవీపేటలోని తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఆరు బయట నిద్రిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ముఖానికి టవాల్ చుట్టుకున్న గుర్తు తెలియని దుండగుడు బాగిర్తి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడని ఎస్సై పేర్కొన్నారు. శుక్రవారం ఘటనా స్థలాన్ని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ సందర్శించి బాధితురాలి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధర్మోరలో వైభవంగా మండల పూజ



ధర్మోర వేంకటేశ్వర్ ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

మోర్తాడ్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మోర గ్రామంలో శుక్రవారం ఉదయం మండల పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాతలు రాజేశ్వర్‌రెడ్డి, ప్రమోద్ కుమార్ రెడ్డిలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు యజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి వేయించాలి

కోటగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్య అధికారి సురేష్ సూచించారు. పొతంగల్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మండలంలో వచ్చే నెల 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. రైతులు తప్పనిసరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సుధీర్ గౌడ్, లక్ష్మి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్‌బిలోలిలో

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో శుక్రవారం పశువైద్య అధికారి విఠల్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. పశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ముందస్తుగా వ్యాధి నివారణ టీకాలు అందించడం జరిగిందని ఆయన అన్నారు. ముందుగా గ్రామంలో చాటింపును వేయించి పశువుల యాజమానులకు సమాచారం అందించి గ్రామంలో టీకాలను పంపిణీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఎవరైనా అందుబాటులో లేకపోతే తమను సంప్రదిస్తే వచ్చి పశువులకు వ్యాధి నివారణ టీకాలు అందజేస్తామని ఆయన అన్నారు. సుమారు మండలంలో ఇప్పటివరకు 1800పశువులకు గాలికుంటు నివారణ టీకాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఆయన వెంట జూనియర్ వెటర్నరీ అధికారులు గంగారాజు, నాగవర్ధన్, నవీన్, సావిత్రి, భాస్కర్ గౌడ్, లక్ష్మణ్, యశ్వంత్ ఉన్నారు.

దోంచందలో..

ఏర్గట్ల: మండలంలోని దోంచంద గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారిణి రాజ్యలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు వేయించడం వల్ల ఆవులు, బర్రెలలో వచ్చే గాలికుంటు వ్యాధి లక్షణాలు నోటి పుళ్లు చొంగకారడం, కాలి డెక్కలలో పగుల్ళు ఏర్పడి నడవలేకపోవడం, పాల ఉత్పత్తి తగ్గడం వంటి లక్షణాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నరేందర్, ప్రవీణ్ రెడ్డి, ఎల్ఎస్‌లు మధుకర్, భూమరెడ్డి, గోపాల మిత్రలు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారిణి హర్షిత

జక్రాన్‌పల్లిలో ..

జక్రాన్‌పల్లి: మండలంలోని జక్రాన్‌పల్లిలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యాధికారిణి డాక్టర్ హర్షిత వేశారు. 257 పశువులకు, 60 ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్ నగర్‌లో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను మాజీ కౌన్సిలర్ ఖాందేష్ సంగీత శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిరాయత్ నగర్‌కు చెందిన చంద్రకళ, సంతోష్‌నగర్‌కు చెందిన రాజమణిలకు కల్యాణ లక్ష్మీ చెక్కులు మంజూరయ్యాయి. చెక్కుల మంజూరుకు కృషిచేసిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, అన్వేష్, శరత్, నరేష్, మజీద్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఏర్గట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 2లక్షల 20వేలు మంజూరీ కాగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెక్కుల మంజురీ చేసి రాష్ట్ర మినరల్ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర కో ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీ మునీర్, సున్నపు అంజయ్య, రేండ్ల రమేష్, రొక్కెడ సంజీవ్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్‌లు పాల్గొన్నారు.

ఆంధ్రనగర్, కౌల్‌పూర్ గ్రామాల్లో..

నందిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంధ్రనగర్, కౌల్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ అందజేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న బాధితురాలు బండి నాగరాణికి రూ.60వేల చెక్కును, అలాగే నడిశేరం రాజన్నకు రూ.17 వేలు, బల్లం రవికి రూ.34వేలు చెక్కులను ఆస్పత్రి ఖర్చుల కోసం పంపిణీ చేశారు. సీ ఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనశ్రీను, అడవి రాము, దమ్మాయి శ్రీను, గొజ్జి రాజేందర్, చిన్నయ్య, జితేందర్, నవీన్, శివ ఉన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

నవీపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాసర రోడ్డు మూల మలుపు వద్ద వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. రజక ఐక్యవేదిక, యువజన సేవ సమితి ఆధ్వర్యంలో ఈ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కామయ్య, అశోక్, బోజన్న, శ్రీధర్, రాజశేఖర్, వీడీసీ సభ్యులు సూరిబాబు, మోస్రా సాయిరెడ్డి, నవీన్ రాజ్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, రాము,దేవరాజ్, ప్రవీణ్, పోసాని తదితరులున్నారు.

కల్దుర్కిలో హరినామ సప్తాహ



కల్దుర్కిలో అఖండ హరినామ సప్తాహ దృశ్యం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్దుర్కి గ్రామంలో 37వ అఖండ హరినామ సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శుక్రవారం నుంచి గురువారం వరకు గ్రామంలోని హనుమాన్, విఠలేశ్వర ఆలయ ప్రాంగణంలో ఘనంగా అఖండ హరినామ సప్తాహ నిర్వహిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 37సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఆధ్యాత్మిక కార్యక్రమం ఏడు రోజుల పాటు భగవంతుడి నామస్మరణతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతీరోజు భజనలు, కీర్తనాలలో ఒక స్వామిజీ పాల్గొని భక్తులకు ప్రవచనాలు చేస్తారని పేర్కొన్నారు. 37వ అఖండ శివనామ సప్తాహ కార్యక్రమంలో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఉంటుందన్నారు. ఏడు రోజుల పాటు భక్తులకు కాపాలి ప్రకాష్ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ గంగాధర్, కార్యదర్శి సాయిపటేల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మి రాజన్న, ప్రకాష్ పటేల్, గ్రామ పెద్దలు మహేందర్ రెడ్డి, రాంజీ, దిగంబర్, గురూజీ, మొగులయ్య, సాయిలు, పీరాజీ, దత్తు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేసిన హైవే సిబ్బంది



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న హైవే సిబ్బంది

ముప్కాల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ నుంచి కొత్తపల్లి వెళ్లేదారిలో పాఠశాల సమీపంలోని మూలమలుపు వద్ద రోడ్డుకు హైవే సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 13వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ప్రమాదకరంగా మారిన రహదారి అనే కథనానికి స్పందించిన హైవే సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై మొరం వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఇలా ఉండగా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి సమస్య శాశ్వతంగా పరిష్కరించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన వక్ఫ్ చట్టాన్ని

ఉపసంహరించుకోవాలి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నూతన వక్ఫ్ చట్టాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని మైనారిటీలు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం మసీదు నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా మైనారిటీ యువత, నాయకులు భారీ సంఖ్య ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చట్టం దేశ చరిత్రలో చీకటి అధ్యయనం అని మైనారిటీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రార్థన అనంతరం నల్లబ్యాడ్జీలు పట్టుకుని రోడ్లపైకి ర్యాలీగా వచ్చారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టం బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు మాట్లాడుతూ బీజేపీ మత రాజకీయాలకు అండగా ఉంటూ ఓ వర్గానికి న్యాయం చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగం ఇచ్చిన వెసులుబాటును అవహేళన చేస్తుందన్నారు. ఈ బిల్లును రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

ఘనంగా శివ గంగా భవాని మాత కల్యాణం



హసాకొత్తూర్‌లో శివగంగాభవాని మాత కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలంలోని హసాకొత్తూర్ గోనె చెరువులో కొలువుదీరి ఉన్న గంగపుత్రుల ఆరాధ్య దైవం శివగంగమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం గంగాభవాని మాత కల్యాణం ఆలయ అర్చకులు జిమ్మె గారి అజయ్ శర్మ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మ వారికి మహాభిషేకం, అలంకరన నైవేద్య హారతి మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోశ్చరణల మధ్య శివగంగా భవాని మాత కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాగణంలో అన్నసత్ర కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వివిధ పార్టీ నాయకులు గంగపుత్ర సంఘం అధ్యక్షుడు అధ్యక్షుడు జుంబెరాత్ శంకర్, కార్యదర్శి ఎల్ల నర్సయ్య, కోశాధికారి ఆల్గోట్ నారాయణ, సొసైటీ అధ్యక్షుడు ఆల్గోట్ రమేష్, కార్యదర్శి నారాయణ,సంఘ సభ్యులు గంగమ్మ దేవి దీక్షాపరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో జరుగుతున్న జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు

చురుగ్గా జాతీయ రహదారి పనులు

● రూ.899 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ ● మెదక్ జిల్లా హవేలి ఘన్‌పూర్ నుంచి రుద్రూరు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు
● 10 నెలల క్రితమే ప్రారంభమైన రహదారి విస్తరణ పనులు ● ప్రధాని శంకుస్థాపనతో పనులు వేగవంతం

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మెదక్, బాన్సువాడ (హెచ్ఎంబీ) 765డీ మెదక్ నుంచి రుద్రూరు వరకు జరగాల్సిన ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. కేంద్రప్రభుత్వం 2022లో ఈ రాష్ట్రరహదారి జాతీయ రహదారిగా మార్చుతూ జాతీయ రహదారి విస్తరణ నిర్మాణం కోసం రూ.899 కోట్లు మంజూరు చేసింది. గత సంవత్సరం 5 మార్చి 2024న పటాన్ చెరువులో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని ఈరోడ్డు విస్తరణ పనులను వర్చువల్ శంకుస్థాపన చేశారు. స్వయనా ప్రధానమంత్రి ఈ జాతీయ రహదారి విస్తరణ పనులను శంకుస్థాపన జరపడంతో రోడ్డువిస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గతసంవత్సరం 2024 జూన్ మాసంలో మెదక్ జిల్లా హవేలి ఘన్‌పూర్ మండల కేంద్రం నుంచి ఈ జాతీయ రహదారి నిర్మాణం పనులు ప్రారంభించారు. హైదరాబాద్ టు మెదక్ వరకు 765డీ జాతీయ రహదారి విస్తరణ పనులు ఏడాది క్రితమే పూర్తయ్యాయి. ప్రస్తుతం మెదక్ నుంచి నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, బాన్సువాడ వర్ని మీదుగా రుద్రూరు వరకు ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

● రెండు ప్యాకేజీల ద్వారా రోడ్డు విస్తరణ పనులు

ఈ జాతీయ రహదారి విస్తరణ పనులను రెండు ప్యాకేజీల ద్వారా జరుపుతున్నారు. మెదక్ జిల్లా కేంద్రం నుంచి ఎల్లారెడ్డి వరకు సుమారు 43.91 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించడానికి రూ.399 కోట్లు, ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడ మీదుగా రుద్రూరు వరకు సుమారు 51.66 కిలో మీటర్ల పొడవు రహదారి విస్తరణ పనుల కోసం రూ.500 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు గత జూన్ మాసంలో 10 నెలల క్రితం ప్రారంభించారు. మొదట మెదక్ జిల్లా హవేలి ఘన్‌పూర్ నుంచి ప్రారంభించి ఈ జాతీయరహదారి విస్తరణ పనులు ప్రసుత్తం రెండు ప్యాకేజీలలోనూ చురుగ్గా కొనసాగుతున్నాయి.

ప్రధాని శంకుస్థాపనతో పనుల్లో వేగం

మెదక్ - రుద్రూరు 765డీ జాతీయ రహదారి విస్తరణ పనులకు భారత ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా శంకుస్థాపన చేయడంతో పనులు ప్రారంభమై వేగంగా కొనసాగుతున్నాయి. 5 మార్చి 2024న పటాన్ చెరువులో బీజేపీ నిర్వహించిన జాతీయ సంకల్ప సభలో ప్రదాని నరేంద్రమోదీ పాల్గొని ఈ జాతీయ రహదారి విస్తరణ పనులను వర్చువల్‌గా శంకుస్థాపనచేశారు. అనంతరం లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఎన్నిల కోడ్ అమలులో ఉండటంతో పనులు ప్రారంభం కాలేదు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తిరిగి బీజేపీ భారీ మెజారిటీ సాధించి అధికారంలోకి రావడం, నరేంద్రమోది తిరిగి ప్రధాని కావడంతో ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమై చురుగ్గా సాగుతున్నాయి. ఈ రాష్ట్ర రహదారిని 2022లో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి 765 డీగా గుర్తిస్తూ మంజూరు చేసింది. రోడ్డు విస్తరణ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.899 కోట్లు మంజూరు చేసింది. మొదట్లో రోడ్డు విస్తరణ పనుల శంకుస్థాపనలో తీవ్ర జాప్యం జరగడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రధాని నరేంద్రమోది శంకుస్థాపన చేయడంతో పనులు ప్రారంభమై వేగంగా కొనసాగుతున్నాయి.



రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీపై టైల్స్ వేస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేటలో చకచకా పనులు

నాగిరెడ్డిపేట మండలంలో జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనులతోపాటు రహదారి ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణం పనులు, ఇరు పక్కల సర్వీస్ రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండల కేంద్రంలో జాతీయ రహదారి ఇరు పక్కల డ్రైనేజీ నిర్మాణం పనులు దాదాపు పూర్తి కావడంతో ప్రస్తుతం డ్రైనేజీపైన టైల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని సీఎస్ఐ చర్చీ ఆధ్వర్యంలో ఘనంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ ప్రధాన చర్చీలో శుక్రవారం ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ పాస్టర్లు యేసుప్రభు శిలను పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో భక్తులు బైబిల్ పఠనంతోపాటు భక్తి గీతాలు ఆలపించారు. చర్చి లోపలికి వెళ్లగానే భక్తులు పెద్ద ఎత్తున శిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ యేసుప్రభు దయ ప్రేమను అందించడానికి తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. త్యాగంలో ఎంత మధురం ఉంటుందో యేసుప్రభు చేసిన త్యాగమే మనందరికీ ఆదర్శం అని అన్నారు. ఆయన చూపిన బాటలో పయనించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్టియన్లు పాల్గొన్నారు.



సందేశం ఇస్తున్న పాస్టర్



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ప్రతీఒక్కరు
భక్తి భావాన్ని పెంచుకోవాలి

● హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి



మాట్లాడుతున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి

రెంజల్,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే మనిషి మానసిక ప్రశాంతత మెరుగుపడుతుందని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి అన్నారు. శుక్రవారం రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామంలో త్రివేణి సంగమ క్షేత్రం నందు అహల్యాబాయి ఓల్‌కార్ విగ్రహంతో పాటు శ్రీ విఘ్నేశ్వర, శ్రీ కుమార స్వామి(స్కంద), శ్రీ రుక్మిణి పాండురంగ, శ్రీ కేశవమూర్తి విగ్రహాలను ప్రతిష్టించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెగ్డేవార్ పూర్వీకుల గ్రామమైన కందకుర్తి గ్రామానికి చాలా విశిష్టత కలిగి ఉందని, స్కందుడు ఇక్కడే తపస్సు చేసి ఉండడంతో స్కందకుర్తి కాలక్రమేనా కందకుర్తిగా మారిందన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకుని ఇతరులకు సహాయపడినప్పుడే సేవ భావం పెంపొందుతుందన్నారు. ఇతరులకు సేవ చేయడమే నిజమైన భక్తి అన్నారు. అన్ని ధర్మలలోకెల్లా హిందు ధర్మ పవిత్రమైందని ప్రతి ఒక్కరు హిందు ధర్మాన్ని పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు ధర్మమార్గంలో నడిచినప్పుడే జన్మ సార్థకం అవుతుందన్నారు. కందకుర్తి ప్రదేశం ఎంతో చరిత్ర కలిగిన ప్రదేశం అని, శ్రీరాముడు నడియాడిన పుణ్యభూమి, ఎంతో మహిమ గల కందకుర్తి క్షేత్రంలో నూతన ఆలయాన్ని నిర్మించుకుని విగ్రహాలను ప్రతిష్ఠించడం జరిగిందన్నారు. హిందు ధర్మాన్ని ఆచరించి ధర్మానికి పాటుపడి ప్రతి ఒక్కరు ధర్మమార్గంలో పయనించి దేవుడి సేవతో దేశ సేవను కూడా కొనసాగించాలన్నారు. మానవ జీవితానికి భక్తిమార్గం అత్యంత ముఖ్యమైందన్నారు. మానవ జీవితంలో దైవకార్యం ముఖ్య పాత్రని అన్నారు. కార్యక్రమంలో మల్లారం ఆశ్రమం వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్, వివిధ క్షేత్ర సంచాలకులు, సంఘ సంచాక్‌లు సుందర్ రెడ్డి, తిప్పె స్వామి, వీఆర్ మోహన్ రెడ్డి, సీబీఆర్ ప్రసాద్, సోమయాజులు, సుధారెడ్డి, సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్, నిమ్మల ప్రతాప్ రెడ్డి, చంద్రశేఖర్ జీ, సృజన్ కుమార్, కాపార్తి గురు చరణ్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జాతీయ పసుపు బోర్డు సభ్యులు పల్లె గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందేదెన్నడో?



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జుక్కల్ మండల వ్యవసాయ అధికారి అశ్రిత (ఫైల్)

జుక్కల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో బస్వాపూర్, కండెవల్లూరు, ముందాబాద్, కల్లాలి, వివిధ గ్రామాల్లో ఇటీవల చెడుగొట్టు వానలు కురవడంతో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిని వరి ధాన్యం దిగుబడి తగ్గిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జుక్కల్ మండలంలో 150 ఎకరాలు పంట నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ అధికారి ఆశ్రిత వ్యవసాయ ఉన్నతాధికారులకు నివేదికలు సైతం పంపారు. అధిక పెట్టుబడులు పెట్టి పంటలు కోతకు వచ్చే సమయంలో అకాల వర్షాలతో వరి ధాన్యం గింజలు నేలపై రాలిపోఆయి. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నతాధికారులు, మంత్రులు పంట నష్టపోయిన రైతులకు పరిహారం త్వరలో ప్రకటిస్తామని పత్రిక ప్రకటనలు కాగితాలకే పరిమిమతువుతున్నాయి. నష్టపోయిన పంటలకు నివేదికలు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వరి కోత నూరుపుళ్లు జరగడంతో రైతులకు వరి ధాన్యం దిగుబడి భారీగా తగ్గడంతో పెట్టిన పెట్టుబడి డబ్బులు వస్తాయా.. రావా.. అని దిగులు చెందుతున్నారు. రాష్ట్రప్రభుత్వం రైతులపై ప్రేమచూపించి పంట నష్టపోయిన రైతులను ఎకరానికి 10వేల చొప్పున రైతుల ఖాతాలో జమ చేయాలని రైతులు డబ్బుల కొరకు నిరీక్షణ చేస్తున్నారు.

పంట నష్టంపై నివేదికలు సమర్పించాం

● అశ్రిత, మండల వ్యవసాయ అధికారి

మండలంలో కురిసిన అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలు దాన్ని గింజలు నేలపై రాలాయి. మండలం మొత్తం మీద 150 ఎకరాలు పంట నష్టం వాటిలిందని అధికారులు గుర్తించాం. నష్టపోయిన పంట మొత్తం మీద 33 శాతం ధాన్యం గింజలు నేలపై రాలినట్లు గుర్తించి వ్యవసాయ అధికారులకు నివేదికలు సమర్పించామని తెలిపారు.

ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందజేయాలి

● గంగారాం, రైతు



అకాల వర్షాలు చెరువుగట్టు వానలు కురిసి రాళ్లు పడడంతో వరి పంట ధాన్యం గింజలు నేలపై రాలిపోయింది. అధిక పెట్టుబడులు పెట్టి పుష్కలంగా దిగుబడి వస్తుందని ఆశలు పెట్టుకున్నాం. వరి ధాన్యము కోతకు వచ్చే సమయంలో పంటలు వానలతో దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలి.

మూలనపడిన బర్దిపూర్ లిఫ్ట్!

● రెండున్నరేళ్లుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై నిర్లక్ష్యం
● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

డిచ్‌పల్లి, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది బర్దిపూర్ లిఫ్ట్ పరిస్థితి. గత కాంగ్రెస్ హయాంలో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ప్రారంభించిన బర్దిపూర్ ఎత్తిపోతల పథకం రైతాంగానికి 2వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఏర్పాటుచేశారు. కానీ ప్రస్తుతం ఈ లిఫ్ట్ పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పూర్తిగా నిరుపయోగంగా మారి మూలనపడింది. ఈలిఫ్ట్ ద్వారా మండలంలోని ఘన్‌పూర్ మిట్టపల్లి, ఖిల్లాడిచ్‌పల్లి, బీబీపూర్ తాండ, బర్దిపూర్, ధర్మారం గ్రామాలకు సాగు నీరు అందిస్తుంది. కోట్లాది రూపాయలతో రైతాంగానికి సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో నాటి సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఎత్తిపోతల పథకం ఆలనాపాలన కరువైంది. ఎత్తిపోతలతో నమ్ముకున్న రైతాంగం ఆశలు ఆడిఆశాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల ఆశాలు సన్నగిల్లాయి. లిఫ్ట్ 5ఎంవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి రెండున్నర ఏళ్లు గడిచిన ఇంతవరకు విద్యుత్‌శాఖ అధికారులు కొత్తట్రాన్స్‌ఫార్మర్ బిగించకపోవడంతో ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో గతంలో మాజీఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ 5ఎంవీ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయించినా అది సైతం కాలిపోవండంతో అప్పటినుంచి దాన్ని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఎత్తిపోతల పర్యవేక్షణ అధికారులు తమకేమీ పట్టన్నట్లు వ్యవహరించడంతో విలువైన మోటార్లు పనిచేయకుండా మూలనపడ్డాయి. ఇప్పటికే దొంగలు ఇనుపగేట్‌లను చోరీచేయగా మరి కొంతమంది ఎత్తిపోతల పథకం వద్ద పేకట స్థావరంగా మార్చారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వంలోని పాలకులు స్పందించి లిఫ్టని పునర్ నిర్మాణం చేయాలని, లిఫ్ట్ ద్వారా సాగునీరు అందేల చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా లిఫ్టను పునర్‌నిర్మాణం చేసి ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



మూలన పడిన బర్దిపూర్ లిఫ్ట్

నీటి కోసం అల్లాడుతున్న వన్యప్రాణులు

● అడవుల్లో నీటి జాడ కరువు ● సాసర్ పీట్లలో కనిపించని నీరు



లింగంపేట పెద్ద వాగు సమీపంలో నీటి కోసం వచ్చిన ఎలుగు బంటి

లింగంపేట, ఎప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో అడవుల్లో నీటి జాడ లేక వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. జిల్లాలో 82,130 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. జిల్లాలోని లింగంపేట, గాంధారి, ఎల్లారెడ్డి, వెల్లుట్ల, బొల్లారం, ఎర్రాపహాడ్, మాచారెడ్డి, గుండారం, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, సింగితంలలో దట్టమైన అడవులు విస్తరించి ఉన్నాయి. అడవులలో చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, నక్కలు, మన్నుపోతులు, ఏదులు, కుందేళ్ల, అడవి పందులు, నెమళ్లతో పాటు పలు రకాల వన్యప్రాణులు లక్షల్లో ఉన్నాయి. అడవుల్లో నీటి జాడ లేక వన్యప్రాణులు సమీప గ్రామాల్లోకి వస్తున్నాయి. గ్రామాల సమీపంలోని పంట చేనుల వద్ద ఉన్న పశువుల మందలపై రాత్రి వేళల్లో దాడులు చేసి పశువులను చంపుకొని తింటున్నాయి. దీంతో అటవి సమీపంలోని గ్రామాల రైతులు భయాందోళన చెందుతున్నారు. ఈ సంవత్సరం మార్చి నుంచే ఎండలు తీవ్రం కావడంతో అడవుల్లో అక్కడ అక్కడ కుంటలు, చెక్‌డ్యాంలు, గుంతల్లో ఉన్న నీరు పూర్తిగా ఇంకి పోయింది. దీంతో నీరు దొరకక అడవుల్లో వనప్రాణులు మృతి చెందుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. నీటి కోసం అడవులకు సమీపంలో ఉన్నా పంట చేనుల్లోకి వచ్చిన వన్యప్రాణులను పంట చేనుల యజమానులు కరెంటు షాక్‌లు పెట్టి చంపుతున్నారు. చనిపోయిన వాటిని తినగలిగేవి అయితే గుట్టు చప్పుడు కాకుండా వండుకుని తింటున్నారు. తినగలిగేది కాకుంటే చిరుతలు, ఏగుబంట్లు అయితే వాటిని విద్యుత్ ఫాక్ పెట్టి చంపి వాటిని గుట్టు చప్పుడు కాకుండా అక్కడే పూడ్చి పెడుతున్నారని ప్రజలు అంటున్నారు. ఇంత జరుగుతున్న అటవీశాఖ అధికారులు తమకేమీ తెలియదన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు. అడవులలో ఏర్పాటు చేసిన సాసర్‌పీట్లలో నీరు పోయకుండానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత సంవత్సరం సైతం సాసర్‌పీట్‌లలో నీరు పోయలేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. దీంతో నీరు లేక వన్యప్రాణులు అంతరిస్తున్నాయని వారు అంటున్నారు. మండలంలోని మెంగారం, బోనాల్, మోతె, శెట్పల్లి, ముస్తాపూర్, లక్ష్మాపూర్‌లలో ఏర్పాటుచేసినా సాసర్‌పీట్‌లలో నీరు లేక వెలవెలబోతున్నాయి. ఇప్పటికైన జిల్లా అటవీశాఖ అధికారలు స్పందించి సాసర్ పీట్‌లలో నీరు నింపాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీ వారు సహకరించాలి

● ఓంకార్, ఎఫ్ఆర్‌వో, ఎల్లారెడ్డి

సాసర్‌పీట్‌లలో నీరు పోయడానికి గ్రామపంచాయతీ వారు సహకరించడం లేదని పంచాయతీలలో వాటర్ ట్యాంకర్లు ఉన్నాయి. వాటి ద్వారా వారానికి ఒకసారి సాసర్ ఫీట్లలో నీటిని నింపాలని చెప్పినప్పటికి పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదు. త్వరలోనే సాసర్‌పీట్‌లలో నీటిని పోస్తాం.



లింగంపల్లి శివారులో చిరుత దాడిలో మృతి చెందిన లేగదూడ



మెంగారం అడవిలో నీరు లేక వెల వెల బోతున్న సాసర్ పీట



చీమన్‌పల్లిలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

రాష్ట్రానికి నిధులు రాకుండా అడ్డుకుంటున్న బీజేపీ ఎంపీలు

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చేయూతనిస్తారని ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే రాష్ట్రానికి నిధులు తీసుకరాకుండా బీజేపీ ఎంపీలు అడ్డుకుంటున్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కుర్దుల్‌పేట్, మైలారం, దూప్యతండా, చీమన్‌పల్లి, తాటిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తాటిపల్లిలో 2.50కోట్ల నిధులతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, చీమన్‌పల్లిలో రెండుకోట్లతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తాటిపల్లి, చీమన్‌పల్లిలో జరిగిన సభల్లో డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ, అదనపు వైద్యాధికారి తుకారం, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్ డీఈ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంటల వ్యవధిలో.. ఒకరి తర్వాత మరొకరు..

● అక్కా చెల్లెలి ఇంట్లో ఇద్దరు చిన్నారుల మృతి

● రెండు కుటుంబాల్లో విషాదం



మృతి చెందిన నవ్యశ్రీ



మృతి చెందిన కొమురం గణేష్

నందిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పేగును తెంచుకొని పుట్టిన బిడ్డలు వాళ్లు.. ఇద్దరినీ ఒకే మండలానికి ఇచ్చారు. వారిలో ఒకరికి కొడుకు, మరొకరికి కూతురు. ఎనలేని సంతోషంలో రెండు కుటుంబాల సభ్యులు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. కాని అంతలోనే విషాదం చోటు చేసుకుంది. ఆ రెండు కుటుంబాల్లోన్ని పసి కూనలు నిమోనియాతో ఒకే రోజు.. కొన్ని గంటల వ్యవధిలో మృతి చెందిన ఘటన జిల్లాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని నవీపేట మండలం ఫకీరాబాద్‌కు చెందిన లావణ్య, శ్యామల అక్కచెల్లెలు. వీరిలో అక్క లావణ్యను నందిపేట మండలంలోని బజార్ కొత్తూర్ గ్రామంలోని సాయినాథ్‌కు ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపారు. వీరికి 8నెలల బాబు కొమురం గణేష్ ఉన్నాడు. అలాగే లావణ్యకు చెల్లెలు శ్యామల ఉంది. ఈమెను నందిపేట మండంలోని చౌడమ్మ కొండూర్ గ్రామానికి చెందిన గోపితో ఏడాదిన్నర క్రితం వివాహం జరిపించారు. ఈ జంటకు 6నెలల వయస్సు ఉన్న కూతురు నవ్యశ్రీ ఉంది. అయితే శుక్రవారం నవ్యశ్రీ నిమోనియాతో బాధపడుతుండగా 108 అంబులెన్స్‌లో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దీంతో కుటుంబీకులు సాయంత్రం అంత్యక్రియలు జరిపించారు. కుటుంబీకులు తీవ్ర విషాదంలో ఉండగానే.. కొన్ని గంటల వ్యవధిలోనే అక్క లావణ్య కొడుకు కొమురం గణేష్ అదే నిమోనియాతో బాధపడుతూ ఇంటి వద్ద మృతి చెందాడు. అక్కా చెల్లెలి పిల్లలు ఒకే రోజు మృతి చెందడంతో రెండు గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

నవీపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్ సమీపంలో శుక్రవారం రాత్రి బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన ప్రకారం మిట్టాపూర్‌కు చెందిన నీరడి రమేష్(45)పని నిమిత్తం కోస్లీ వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ధాన్యం లారీ ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నీరడి రమేష్ గతంలో నవీపేట మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఏగా పని చేయగా ప్రస్తుతం నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సబ్ ఆర్డినేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మృతుడి భార్యట పుష్ప, 9వ తరగతి చదువుతున్న కుమారుడు వెంకటేష్, 5వ తరగతి చదువుతున్న కుమార్తె తనుశ్రీ ఉన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

మోడల్ ప్రవేశ పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మోడల్ పరీక్షలను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఒక అవగాహన రావడంతో పాటు వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని ఎస్ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆరు సెంటర్లలో 900 మంది విద్యార్థులకు నిర్వహించిన మోడల్ ఎప్‌సెట్-నీట్ ప్రశ్నపత్రాలను కంఠేశ్వర్‌లోని ఎస్ఆర్ క్యాంపస్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఎప్‌సెట్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మోడల్ పరీక్షలో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు సమయాన్ని ఎలా వృథా కాకుండా పరీక్ష రాయాలో విద్యార్థులకు అవగాహన ఈ మోడల్ పరీక్షల ద్వారా వస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఈ మోడల్ పరీక్షలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు సుధాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజలి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

అక్బర్‌బాగ్‌లో భారీ దొంగతనం

● 13 తులాల బంగారం, 40 తులాల వెండి చోరీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 6వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ దొంగతనం జరిగింది. అక్బర్‌బాగ్‌లో నివాసం ఉండే మిస్బావుల్ రహమాన్ తన కుటుంబంతో సహా హైదరాబాద్‌కు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. బెడ్‌రూంలో ఉన్న బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 13 తులాల బంగారం, 40 తులాల వెండితో సహా నగదును ఎత్తుకెళ్లినట్లు సమాచారం. గురువారం రాత్రి దొంగతనం జరుగగా శుక్రవారం విషయం వెలుగులోకి వచ్చింది. మిస్బావుల్ రహమాన్ కుమారుడు ఇంటికి వచ్చి చూడగా గేటు తాళం వేసినట్లే ఉండి ఇళ్ల తాళం మాత్రం పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్ టీమ్ ద్వారా పోలీసులు తనిఖీలు చేశారు. ఇటీవల 6వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న పోలీసులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రివేళల్లో గస్తీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేయాలి

» కార్యకర్తలు అవిశ్రాంతంగా పోరాడాలి

» నూతన ఎమ్మెల్సీల అభినందన సభలో ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేష్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరవేసే వరకు కార్యకర్తలు అవిశ్రాంతంగా పోరాడాలని, అప్పుడే రాష్ట్రంలో హిందువులు అనుకున్న విధానాలు అమలు అవుతాయని బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని వర్నిచౌరస్తాలోగల ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అధ్యక్షతన గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్యలకు ఆత్మీయ అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేష్‌రెడ్డిలు మాట్లాడుతూ.. దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. హిందూ సమాజాన్ని జాగృతం చేసేందుకు బీజేపీ సంఘ్ పరివార్ సంస్థలు మాత్రమే పనిచేస్తున్నాయని అన్నారు. తెలంగాణలో ప్రజల ఆశీర్వాదంతో కార్యకర్తల కృషితో 8 మంది శాసనసభ్యులు గెలిచారని రేపు రాబోయే రోజుల్లో 80 మందితో గోల్కొండ ఖిల్లా మీదా కాషాయ జెండా ఎగరవేస్తామన్నారు.



నూతన ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న దృశ్యం

గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు చేసిన కృషితోనే విజయం సాధ్యమైందని భవిష్యత్తులో బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు బాధ్యతను తాము తీసుకుంటామని ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, గోపిడి స్రవంతిరెడ్డి, న్యాలంరాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కంచెట్టి గంగాధర్, మాదాసు స్వామియాదవ్, పద్మారెడ్డి, కొండ ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని పోలీస్ స్టేషన్‌లను పరిశీలించిన సీపీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనర్ సాయిచైతన్య నగరంలోని రూరల్ పోలీస్ స్టేషన్, మూడో టౌన్, నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్‌లను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లను మొత్తం తిరిగిన ఆయన పోలీసుల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్ల పనితీరును, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. 5ఎస్ విధానం అమలు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ల ప్రాంగణంలో వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రధానంగా ఎక్కువ ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులకే జరుగుతున్నందున తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించాలన్నారు. గంజాయి నిర్మూలనకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని గంజాయి బానిసలు అయిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. సైబర్ మోసగాళ్ల నుంచి ప్రజలు మోసపోకుండా అవగాహన కల్పించాలని అదేవిధంగా గేమింగ్ యాప్‌ల పట్ల మోసపోకుండా చూడాలన్నారు. సీపీతో పాటు ట్రైయినీ ఐపీఎస్ సాయికిరణ్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి, టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజు, సౌత్ రూరల్ సీఐ సురేష్‌కుమార్, మూడవ టౌన్ ఎస్సై2 గంగాధర్, టౌన్ 4 ఎస్సై శ్రీకాంత్, రూరల్ ఎస్సై ఆరీఫ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



రూరల్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

దాశరథి పురస్కారానికి ప్రేమ్‌లాల్ ఎంపిక



నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి ప్రేమ్‌లాల్ ప్రతిష్ఠాత్మక దాశరథి పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు దశరథి సంస్థ ఆర్గనైజేషన్ కన్వీనర్ సతీష్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఒకటో తేదీన హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ప్రేమ్‌లాల్‌కు ఈ అవార్డు అందజేయనున్నట్టు చెప్పారు. కాగా.. దాశరథి పురస్కారానికి ఎంపికైన ప్రేమ్‌లాల్‌ను జిల్లాకు చెందిన పలువురు కవులు అభినందనలు తెలిపారు.

మృతి చెందిన గొర్ల కుటుంబాలకు నగదు అందజేత

ధర్పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒన్నాజీపేటలో రెండు రోజుల క్రితం కలుషిత నీటిని తాగి గ్రామానికి చెందిన 44 గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి. శుక్రవారం ధర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తలా ఇంత పోగు చేసి బాధిత రెండు కుటుంబాలకు రూ.22వేల నగదును అందజేశారు. కాగా ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్ 5వేలు, జనార్దన్‌రెడ్డి 4వేలు, రవి, సుభాష్‌రెడ్డి, సంతోష్‌రెడ్డిలు 2వేల చొప్పున, మంగినాయక్, చెలిమెల శ్రీనివాస్, రమేష్ నాయక్, డాక్టర్ రాజేందర్, మురళి 1000 రూపాయల చొప్పున, సుదర్శన్, జానీలు 500 రూపాయల చొప్పున మొత్తం నగదును అందజేశారు. కార్యక్రమంలో జిల్లాఅధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య పాల్గొన్నారు.

నగరంలో బైక్ చోరీ

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీ కల్యాణ మండపం సమీపంలోగల రోకడ హనుమాన్ మందిరం బయట పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన బాధితుడు రోకడ హనుమాన్ మందిరం బయట తన ఏపి25ఏఆర్3332 నెంబర్ గల ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి లోనికి వెళ్లి దర్శనం చేసుకొని బయటకు వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఉద్యోగ జేఏసీ చైర్మన్‌గా నాశెట్టి సుమన్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ జేఏసీ చైర్మన్‌గా సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో ఉద్యోగ జేఏసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చైర్మన్‌గా సుమన్, జిల్లా కన్వీనర్‌గా అలుక కిషన్, కోకన్వీనర్‌గా మోహన్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు ఉద్యోగ సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నూతన చైర్మన్ సుమన్ మాట్లాడుతూ ఉద్యోగ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

ఇందల్వాయి నూతన ఎస్సైగా సందీప్

ఇందల్వాయి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా సందీప్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఎస్సై మనోజ్‌కుమార్ నిజామాబాద్ హెడ్‌క్వాటర్స్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సందీప్‌ను నియమించారు. నిజామాబాద్ వీఆర్‌లో ఉన్న సందీప్ ఇందల్వాయి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీపీ

ధర్పల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను శుక్రవారం జిల్లా మహిళా బీఆర్ఎస్ నాయకురాలు, ధర్పల్లి మాజీ ఎంపీపీ సుమనరెడ్డి ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో కలిశారు. కేసీఆర్ ఫామౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిసి రూరల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించినట్లు తెలిపారు. ఈనెల 27న వరంగల్‌లో జరుగనున్న సభకు జిల్లా నుంచి మహిళలను పెద్ద సంఖ్యలో తరలించాలని సూచించినట్లు ఆమె పేర్కొన్నారు. సభకు వచ్చే మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టి ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించినట్లు సుమనరెడ్డి పేర్కొన్నారు.

వైభవంగా వినాయకుడి కల్యాణోత్సవం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గణనాథుని భక్తుల నామస్మరణలు వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో వినాయకుడి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సిద్ధి బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి కల్యాణ వేడుకలను నిర్వహించారు. నగరంలోని పద్మానగర్‌లోగల సిద్ధివినాయక స్వామి దేవాలయంలో జరుగుతున్న 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేదపండితులు వేదమంత్రోచ్చరణలు పఠించగా అర్చకులు కళ్యాణంలోని ముఖ్య ఘట్టాలైన యజ్ఞోపవిత ధారణ, మధుపర్కం, పాదప్రక్షాళణం, సిద్ధి బుద్ధి, వినాయకస్వామి ప్రవరలు, జిల్లకర్ర బెల్లం, కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాలు, బ్రహ్మముడి తంతును నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదానంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వినాయకుడి డోలారోహనం..

ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామివారికి డోలారోహన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో సిద్ధి బుద్ధి సమేత వినాయక ఉత్సవ విగ్రహాలను ఉంచి భక్తి పాటలతో డోలోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని పలు వీధులగుండా సిద్ధి బుద్ధి వినాయక స్వామి పల్లకిసేవలో ఊరేగించారు.

పాటలు వింటూ ఆటో డ్రైవర్ ఆకస్మిక మృతి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటోలో పాటలు వింటూ ఆటో డ్రైవర్ ఆకస్మికంగా మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. సుభాష్‌నగర్‌లోని రైతుబజార్ వద్ద ఉన్న వైన్స్‌కు ఎదురుగా ఆటోలో పాటలు వింటూ డ్రైవర్ కూర్చున్నాడు. సుమారు రెండు నుంచి మూడు గంటల వరకు ఆటో డ్రైవర్‌లో చలనం లేకపోవడంతో స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ఆటో డ్రైవర్‌ను పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ సైలెన్సర్ల ధ్వంసం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో బైకుల సైలెన్సర్లను మార్చి శబ్దకాలుష్యానికి పాల్పడుతున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆధ్వర్యంలో ఎక్కువ శబ్ధం చేస్తున్న బైక్ సైలెన్సర్లను వాహనాల నుంచి తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. సుమారు 200 వాహనాల సైలెన్సర్లను పోలీసులు స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. వాహనదారులకు జరిమానాలు విధించారు. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు ప్రసాద్, శేఖర్, ఎస్సై సుమన్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ఇందల్వాయి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్కాకుల శ్రీనివాస్ కుటుంబానికి 5లక్షల రూపాయల ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం అందజేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రి ఖర్చుల కోసం డబ్బులు లేని పేద కుటుంబం కావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం 5లక్షల రూపాయల ఎల్‌వోసీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అందజేసిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, పీసీసీ డెలిగేట్ తలారి సుధాకర్, పార్టీ సీనియర్ నాయకులు కర్నమోహన్, ఆశీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సుభాష్‌నగర్ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్లు పరమపవిత్రంగా భావించే గుడ్‌ఫ్రైడేను జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చి ప్రాంగణాల్లో శిలువ ఏర్పాటు చేసి యేసు ప్రభు చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. యేసు ప్రభు చూపిన మార్గంలో నడుచుకోవాలని నాడు యేసు ప్రభు భక్తులకు ఇచ్చిన సందేశాన్ని మత పెద్దలు భక్తులకు వివరించారు. శిలపై నాడు యేసు ప్రభును శిక్షించిన విధానాన్ని ఎంతో ఆనందంగా భక్తుల కోసం అనుభవించి కష్టాలు మనుషులకు సహజంగానే ఉంటాయని వాటిని అధికమించడం సమ్యమనం ఆత్మ విశ్వాసంతోనే సాధ్యమవుతుందని తెలియజేశారని అన్నారు.

సుభాస్‌నగర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు..

గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని సుభాష్‌నగర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ప్రాంగణంలో శిలపై ఎరుపు రంగు వస్త్రాన్ని ఉంచి యేసు ప్రభును ధ్యానించారు. యేసు ప్రభు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రత్యేక గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి మతపెద్దలు జోసఫ్, సిస్టర్ పరిషనర్ సందేశం ఇస్తూ యేసు ప్రభు మనందరికి దైవదూతగా సేవలు అందించరాని అన్నారు. భక్తులు ప్రత్యేక గీతాలు ఆలపించి యేసు ప్రభు పునర్జన్మించాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నిజామాబాద్ రూరల్: మండలంలోని ముబారక్‌నగర్ శివారులోగల జీసస్ లవ్స్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలకు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు ఆనంద్, రాణిలు మాట్లాడుతూ ఏ పాపం చేయని యేసుక్రీస్తు మానవాళి కోసం కొరడా దెబ్బలు తిని తలపై ముళ్ల కిరీటం పెట్టుకొని చేతులు, కాళ్లలో మేకులు కొట్టబడి సిలువను మోస్తూ భరించిన బాధను అనుభవించి సిలువలో పలికిన ఏడు వ్యాఖ్యలను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఆనంద్, రాణి, కమిటీ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇది ప్రజాపాలననా.. పోలీసు పాలననా?

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కొనసాగుతున్నది ప్రజాపాలననా.. పోలీస్ పాలననా ? పోలీసులు మమ్మల్నే కొడతారు మాపైనే కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాకు ప్రెస్‌నోట్‌ను రిలీజ్ చేశారు. భీంగల్‌లో జరిగిన ఆందోళనలో పోలీసులే కార్యకర్తలపై లాఠీచార్జి చేశారని ఆయన అన్నారు. నాతో పాటు 33 మందిపై అక్రమ కేసులను నమోదు చేశారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ ఇంచార్జి సునీల్‌రెడ్డి కేసులు పెట్టాలని ప్రెస్‌మీట్‌లో చెప్పగానే దెబ్బలుతిన్న బీఆర్ఎస్ కార్యకర్తలపై ఈ కేసులను నమోదు చేశారని అన్నారు. భీంగల్‌లో మంత్రి జూపల్లి పర్యటన సందర్భంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలను కట్టడి చేశారని అన్నారు. రైతుభరోసాను మార్చి 31లోపు వేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ నెరవేరలేదన్నారు. బాల్కొండ నియోజకవర్గం పరిధిలో 51వేల మంది రైతులు ఉంటే 21వేల మందికి మాత్రమే రుణమాఫీ అయ్యిం దన్నారు. మిగతా వారికి ఎప్పుడు ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రజా పాలన పేరుమీద పోలీస్ పాలన కొనసాగుతుందన్నారు. కళ్యాణలక్ష్మీతో పాటు ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించినందుకే కార్యకర్తలపై కేసులు పెట్టారని ఆయన విమర్శించారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలోని మహాత్మ జ్యోతిభాపూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పరుచూరి అనూష ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాల కొరకు 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు అని ఆమె తెలిపారు. బీఎస్సీ ఎంపీసీఎస్, ఎంఎస్‌డీఎస్, ఎంఎస్‌సీఎస్, బీజెడ్‌సీ, ఎస్‌జెడ్‌సీ, బీకాం సీఏ, బీకాం బీఏ, బీఏ ఈపిహెచ్ కోర్సులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి, అధునాతన ల్యాబ్‌లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ తమ ప్రత్యేకతలు అని దరఖాస్తులు ఈనెల 16 నుంచి స్వీకరిస్తున్నామని అర్హులైన వారు కళాశాలలో సంప్రదించాలని లేదంటే దగ్గరలోని మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9948192406, 9542745057 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బ్లేడ్‌తో దాడి చేసిన వ్యక్తి కోసం గాలింపు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో ఈనెల 12న ఓ వ్యక్తిపై బ్లేడ్‌తో దాడి చేసి పరారీ అయిన అనుమానితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ఈనెల 12న నిర్మల్ జిల్లా కుబీర్ మండలానికి చెందిన కుంచెపు బాబు అనే వ్యక్తి రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కౌంటర్ వద్ద పడుకొని ఉండగా గుర్తుతెలియని వ్యక్తి అతనితో గొడవపడి బ్లేడ్‌తో బాబు మెడపై గాయపర్చగా ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతని ఆచూకి కొరకు రైల్వే పోలీసులు గాళింపు చేస్తున్నారు. అతని ఫోటోలు విడుదల చేశారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.94,900	రూ.87,600	రూ.1010

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ఓదెల-2 (10.00, 1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-3 : పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (11.05)
: జాట్ (హిందీ) (1.30)
: సిన్నర్స్ (ఇంగ్లీష్) (4.40, 7.40, 10.40)
స్క్రీన్-4 : డియర్ ఉమా (11.00)
: ది చూసెన్ లాస్ట్ సుప్పర్ (ఇంగ్లీష్) (2.10)
: జాక్ (4.45)
: పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (7.40)
: మధురం (10.05)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓదెల-2 (10.40, 1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-2 : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.00, 10.40)
: ఒక్కడు (1.40, 7.40)
స్క్రీన్-3 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.00, 1.35, 4.30, 7.25, 10.20)

లలితామహల్ : జాక్ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాట్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఓదెల-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్